దరఖాస్తుల ఆహ్వానం

బహదూర్‌పురా: ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐలో ఐటీఐ/ఏటీసీ కోర్సుల ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీఐ ప్రాగణంలోనికి వచ్చిన విద్యార్థులకు అక్కడే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా చేస్తామన్నారు. మొదటి రెండు దశలో సీట్లు పొంది కూడా ఇంకా రిపోర్ట్ చేయని విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు అన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ కరెన్సీ, నాణేల ఎగ్జిబిషన్

చార్మినార్: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అరుదైన నాణేలు, కరెన్సీ, స్టాంపుల అంతర్జాతీయ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నామని సొసైటీ కార్యదర్శి ఖదీర్ ఉల్లా ఖాద్రి తెలిపారు. మొగల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఈనెల 15, 16, 17 తేదీల్లో అరుదైన నాణేలు, కరెన్సీ, స్టాంపులు, చారిత్రక పెయింటింగ్‌ల ప్రదర్శన నిర్వహించనున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8500212306లో సంప్రదించవచ్చు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి



గౌలిపురా: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గౌలిపురా డివిజన్‌లోని గాంధీ విగ్రహాన్ని శుభ్ర పరిచి కడిగి పూలమాలలు సమర్పించారు. అనంతరం మహిళలు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గులు వేశారు. కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, దశరథ లక్ష్మి, శోభారాణి, రేణుక, స్వప్న, రజనీ, సుమన్ కుమార్ ముదిరాజ్, కొడి సురేందర్ పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ సునీల్

జియాగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని కుల్సుంపురా ఏసీపీ మునావర్ అన్నారు. గురువారం కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశానికి ఏసీపీ హాజరై ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లో ఊరేగింపులో, మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా ఏర్పాటు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాంపల్లి: కుటుంబ కలహాలను భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కోమటికుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. హబీబ్‌నగర్ కోమటికుంటలో నివాసముంటున్న కృష్ణ(37) కోమటికుంటలోని ఓ ఆటో మొబైల్స్ దుకాణంలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య అనిత టైలర్ పనిచేస్తోంది. వీరికి ఇద్దరు చంటి పిల్లలు ఉన్నారు. కొన్నాళ్ళుగా భార్యా భర్తల నడుమ మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కృష్ణ తాగుడుకు బానిసయ్యాడు. ఈ కలహాలను తట్టుకోలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ అశోక్ చక్రవర్తికి ఉత్తమ అవార్డు



అఫ్జల్‌గంజ్: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ అశోక్‌చక్రవర్తి తోలనకు అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రిబుట్ ఆఫ్ ఇండియాస్ ఇండిపెండెన్స్ అనే అంశంపై ఆయన రాసిన కవిత, సారాంశానికి సిసార్ట్ సంస్థ అతడిని ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసి ఇండియా చాప్టర్ అధ్యక్షుడిగా నియమించింది. 80 దేశాల్లో కొనసాగుతున్న ఈ సంస్థకు భారతదేశ చాప్టర్ అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ అశోక్ చక్రవర్తి పేర్కొన్నారు.

మూసీకి వరద ఉధృతి



వరద నీరుతో సగం వరకు మునిగిన పురానాపూల్ వంతెన కానలు



పురానాపూల్ వద్ద మూసీ నదిలో మునిగిన చాకిరేవులు



బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న కుల్సుంపురా పోలీసులు, నరహరిచారి

పురానాపూల్ వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జంట జలయాశయాల వరద నీరు వదలడంతో పురానాపూల్ వద్ద మూసీనదిలో గల చాకిరేవులు, ఆలయాలు, వంతెన కానలు సగం వరకు మునిగాయి. దీంతో కుల్సుంపురా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వంద ఫీట్ల జాతీయ రహదారిలో ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి, తరచు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. యువకులు సెల్ఫీల కోసం నది గోడలపైన నిలిచిన ఉంటుండగా పోలీసులు తరిమివేస్తున్నారు. వంద ఫీట్ల రహదారిలో వర్షాల ధాటికి రోడ్డు కొట్టుకు పోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. – జియాగూడ

పంద్రాగస్టు వేడుకలకు 'కోట' ముస్తాబు



రాణిమహల్ ప్రాంతంలో సిద్ధమైన వీఐపీల వాటర్ ప్రూఫ్ టెంట్



కోట మెయిన్ గేటు వద్ద ఫుట్‌పాత్‌లకు రంగులు

గోల్కొండ: పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబైంది. కోటలోని రాణిమహల్ లాన్స్ వద్ద ముఖ్యమంత్రి పతాకావిష్కరన చేసే వేదిక సిద్ధమైంది. అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర వీఐపీల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు కూడా పూర్తిగా సిద్ధమైయ్యాయి. వర్షం కురిసే అవకాశం ఉన్నందున అధికారులు ముఖ్యమంత్రి వేదికతో పాటు వీఐపీలు, ఎమ్మెల్యేల టెంట్లకు సైతం వాటర్ ప్రూఫ్ రూఫ్ ఏర్పాటు చేశారు. అయితే ఈ సారి ఆహ్వానితుల సంఖ్య కుదించడం జరిగింది. మరోవైపు గురువారం సాయంత్రం నుంచి పోలీసులు, బల్దియా అధికారులు గోల్కొండలో అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ సెక్యూరిటీ అధికారులు సైతం ముఖ్యమంత్రి కోటలోకి వచ్చే మార్గంతో పాటు పతాకావిష్కరణ గావించే వేదిక, దాని పరిసరాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ల పర్యవేక్షణలో గోల్కొండ కోట వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో ఆల పురుషోత్తమ్‌రావు, లాల్ సింగ్ తదితరులు



తిరంగా ర్యాలీలో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ పరిసర ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గోషామహల్ పరిసర ప్రాంతాల్లో వందలాది మంది విద్యార్థులు, యువకులు, నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, కార్పొరేటర్ లాల్ సింగ్, సోమ్రాజ్ సింగ్‌తో పలువురు నాయకులు ర్యాలీ కొనసాగించారు. ఆల పురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ..పంద్రాగస్టు రోజు ప్రతి ఇంటిపై తిరంగా జెండా ఎగరవేయాలన్నారు. గణేష్ సింగ్, విక్కింగ్, రాజు, హనుమాన్ దాగ, సుధీర్ సింగ్, నరేష్, ప్రవీణ్, రాజు లకన్, ప్యారామౌంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి, వాసు పాల్గొన్నారు.

కార్వాన్‌లో..

గోల్కొండ: బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ బీజేపీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉడ్డడి జగదీష్ ఆధ్వర్యంలో కార్వాన్, గుడిమల్కాపూర్‌లలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ..ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు మధుసూదన్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ కార్వాన్‌లో జాతీయ జెండాను పంపిణీ చేశారు.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గ కార్యక్రమ కన్వీనర్ శివకుమార్ యాదవ్ హాజరై ప్రారంభించారు. సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం నుంచి 58 బస్తీలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వెంకటేష్‌యాదవ్, నర్సిములు, కిషోర్, రమేష్ చౌగ్లే పాల్గొన్నారు.

యాకుత్‌పురాలో..

యాకుత్‌పురా: యాకుత్‌పురాలోని పలు ప్రాంతాల్లో నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ డబీర్‌పురా డివిజన్ అధ్యక్షుడు జగన్ మోహన్ చారి ఆధ్వర్యలో గురువారం నాయకులు, పాఠశాలల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీ యాకుత్‌పురా, రైల్వేస్టేషన్, బహ్మణ్‌వాడి, బడాబజార్, నాగాబౌలీ ప్రాంతాల్లో కొనసాగింది. శ్రీనాథ్, మహేశ్వర్, శ్యామ్ యాదవ్, విద్యవత్రా, ఈశ్వర్‌యాదవ్, రాము యాదవ్ పాల్గొన్నారు.

గణేష్ యాక్షన్ టీంలు ఏర్పాటు చేస్తాం



సమావేశంలో జోనల్ కమిషనర్, అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు

చార్మినార్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేకంగా గణేష్ యాక్షన్ టీంలు ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 27 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, పలు విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..అన్ని ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఉత్సవాలకు తమ పరిధిలో ప్రత్యేక గణేష్ యాక్షన్ టీం బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ఇన్ కేశఫ్ అలీ, మంగతయారు, సురేందర్, సరిత, అరుణకుమారి, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కొడి మహేందర్, ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

శిథిల భవనం కూల్చివేత



అబిడ్స్: భారీ ఎత్తున వర్షాలు పడుతుండడంతో అబిడ్స్ జీహెచ్ఎంసీ-14వ సర్కిల్ పరిధిలో ఓ పురాతాన భవనాన్ని టౌన్‌ప్లానింగ్ జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. బేగంబజార్ పరిధిలో ఫీల్‌ఖానా ప్రాంతంలో శిథిలావస్థ భవనానికి బుధవారం జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ ఏసీపీ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సెక్షన్ అధికారి మహేందర్ ముందుగా హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. గురువారం ఉదయం నుంచి కూల్చివేత ప్రారంభించారు. గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ రమేష్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ మహేందర్ మాట్లాడుతూ..ప్రాణాంతకంగా మారిన భవనాలను కూల్చివేసేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. అన్ని ప్రాంతాల్లో ప్రతి రోజు పర్యటించి పురాతన భవనాల పరిశీలన చేపడుతున్నామన్నారు.

రోడ్లు, ఇళ్ల మధ్య వర్షపు నీరు నిల్వకుండా చర్యలు



టోలిచౌకీ సాలర్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: రోడ్లు, ఇళ్ల మధ్య వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. ముందుగా టోలిచౌకీ సాలర్‌ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వర్షపు నీటిని ఆయన పరిశీలించారు. వెంటనే ఆయన మాన్సూన్ స్క్వాడ్‌ను పిలిపించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతంలో పర్యటించి స్థానికులను కలుసుకున్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అబీబ్ చౌస్, బల్దియా అధికారులున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రాణి రజిత మాధురి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అస్థిత్వం దశమ వార్షికోత్సవ వేడుకలను గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ రచయిత్రి సహజ లక్ష్మీపురం రచించిన హియర్ ఐ బిగిన్ ఆంగ్ల పుస్తకం, రచయిత వీఆర్.శర్మ రచించిన ద లాస్ట్ ఎవల్యూషన్ పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..9వ తరగతి చదువుతున్న చిన్నారి సహజ సామాజిక, మానవ సంబంధాలపై ఇంగ్లిష్‌లో పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కె.వెంకట రమణ మూర్తి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.రాణి రజిత మాధురి, సంస్థ అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి



రాజేశ్వర్, బాలక్‌దాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

లంగర్‌హౌస్: దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానని షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ లంగర్‌హౌస్ శాఖ నూతన అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి బాలక్‌దాస్ అన్నారు. ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మటి సుదర్శన్ బాబు ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ శాఖ నూతన అధ్యక్షుడిగా డి.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బోగి బాలక్‌దాస్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యాలయం అంబేద్కర్ భవన్‌లో ఎన్నిక అనంతరం పలువురు నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ..ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వం పథకాలు అందిస్తున్నా దళితులు నోచుకోవట్లేదన్నారు. అందరికీ పథకాలు అందేలా చేస్తూ అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఆర్‌టీఏ రమేష్, హరిదాస్‌పురా అధ్యక్షుడు బోగి మహేష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి శ్రీకాంత్, నాయకులు పూర్ణ చందర్, పాండు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న వి.విజయేంద్ర ప్రసాద్ తదితరులు

చార్మినార్: కేంద్ర సమచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై సాలార్ జంగ్ మ్యూజియం సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన 5 రోజుల ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు పత్రికా సమాచార కార్యాలయం, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు యోధులతోపాటు కొమరం భీం, కాళోజీ నారాయణరావు, సంగం లక్ష్మీబాయమ్మ, ముఖ్దూం మొహినుద్దీన్, దాశరథి తదితర 40 మంది స్వాతంత్ర్య సమరయోధుల వివరాలతోపాటు జాతీయ పతాకం రూపొందిన తీరుపై చిత్రాలు ఏర్పాటు చేశారు. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నాటి తరం చేసిన అమూల్యమైన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణలలో నూతన తరం క్రియాశీల భాగస్వామ్యంతోనే నిజమైన వికసిత్ భారత్ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రభాగాన నిలవాలంటే నూతన ఆవిష్కరణలు మరింత అవసరమని అన్నారు. ఈ సందర్భంగా వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు ఆపరేషన్ సిందూర్- ఆత్మనిర్భర్ భారత్ అనే అంశం మీద వ్యాసరచన, కవిత్వం పోటీలు నిర్వహించారు. విజేతలకు జగదీశ్వర్‌రావు, విజయేంద్ ప్రసాద్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ ఘనశ్యామ్ కుసుమ్, రమణి, పీఐబీ ఉపసంచాలకులు డాక్టర్ మానస్ కృష్ణకాంత్, సీబీసీ ఉపసంచాలకులు కరీనా బి.తెంగమామ్, సహాయ సంచాలకులు జి.కోటేశ్వర్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. ఎస్ఆర్టీ కాలనీలోని సయ్యద్ వీల్లా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చార్మినార్ మండలానికి చెందిన 236 షాదీ ముబారక్ చెక్కులను ఆయన కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పేదలకు షాదీముబారక్ పథకం ద్వారా చెక్కులను అందజేశామన్నారు. యాకుత్‌పురా, ఎస్ఆర్టీ కాలనీ, రెయిన్‌బజార్, ఆమన్‌నగర్-బీ, జహంగీర్‌నగర్, భవానీనగర్, తలాబ్‌కట్టా, డబీర్‌పురా ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, పత్తర్‌గట్టీ డివిజన్ల కార్పొరేటర్లు సమీనాబేగం, మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.